క్లుప్తంగా

కమిషనర్‌కు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు, నాయకులు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌కు ఏపీమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సమ్మె నోటీసు అందజేసారు. ఈ సందర్భంగా సీఐటీయూమండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ కార్మికులను ఇబ్బంది పెట్టే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో జూలై 9న దేశ వ్యాప్త సమ్మె నిర్వహించేందుకు నోటీసు అందజేశామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరిస్తాయన్నారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు వెంకటేష్, నరసింహ, చంద్ర, లక్ష్మీదేవి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సాయిభక్తుల భిక్షాటన

మడకశిర: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సాయి భక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం మడకశిర మండలంలోని వివిధ గ్రామాల్లో సాయిభక్తులు కార్యక్రమం చేపట్టారు. వచ్చేనెల 9,10వ తేదీల్లో పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున గురుపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. వేడుకల సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు భిక్షాటన చేసి ధన, వస్తు రూపేణా ప్రజల నుంచి సాయాన్ని తీసుకుంటున్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్

మడకశిర: పట్టణంలోని సాయినగర్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట మెప్మా అధికారులు ఉన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ



కోనాపురంలో నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ, సిబ్బంది

పెనుకొండ: గొర్రెలు, మేకల కాపరులు నట్టల నివారణ మందు వేయించుకుని జీవాలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీరాములు నాయక్ సూచించారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. ఏడీ మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని, నట్టల నివారణ మందును వేయడం ద్వారా రోగులు సోకవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్న పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు కాడిశెట్టి శ్రీనివాసులు, షహబాజీబాను, విజయలక్ష్మి, వరప్రసాద్, నాగేంద్రను ప్రధానోపాధ్యాయుడు నారాయణస్వామి అధ్యక్షతన ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రవి, ఉపాధ్యాయులు గిరిజమ్మ, భారతి, కరుణకుమారి, రేష్మాబాను, ఆనందమ్మ, కరేష్‌కుమార్, బాబు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

అగళి: ఆలూడి ప్రాథమిక కొన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బోజేగౌడ్, జయసుధను గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోడౌన్లు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక రైతుల అవస్థలు



నిరుపయోగంగా ఉన్న గోడౌన్



సిమెంట్ స్లాబ్‌పై మొలిచిన పిచ్చి మొక్కలు

లేపాక్షి: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు, ప్రజా ఉపయోగకరమని భవనాలు, కార్యాలయాలను నిరుపయోంగా ఉంచారు. రైతన్నలు పండించే ధాన్యాన్ని కనీస మద్దతు ధర వచ్చేంత వరకు భద్రపరుచుకోవడానికి వీలుగా జగనన్న ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి మల్టీ పర్పస్ ఫార్మర్స్ కార్పొరేషన్ గోడౌన్లు నిర్మించారు. వాటిని వినియోగించకుండా నిరుపయోంగా ఉంచారు.

మండల కేంద్రమైన లేపాక్షిలోని వ్యవసాయ కార్యాలయానికి సమీపంలో సుమారు రూ.40 లక్షలతో మల్టీ పర్పస్ ఫార్మర్స్ కార్పొరేషన్ (ఎంపీఎఫ్‌సీ) గోడౌన్ నిర్మించారు. ఈ గోడౌన్ 500 మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల ధాన్యం ఉండడానికి నిర్మించారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పండించే వరి, రాగి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర ధాన్యాలను నిల్వ చేసుకోవడానికి గోడౌన్ ఉపయోగపడే విధంగా వసతులు కల్పించారు. అందులో రైతులు పంటలు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టు కోవడానికి సిమెంట్‌తో తయారు చేసిన స్లాబ్ ఏర్పాటు చేశారు. పండించిన ధాన్యానికి నిల్వ చేసి కనీస మద్దతు ధర వచ్చే వరకు, రైతులు నివాసం ఉండడానికి రెండు గదులు నిర్మించారు. ఇన్ని వసతులతో రూ. లక్షలు వెచ్చించి, ఈ గోడౌన్‌ను నిర్మిస్తే ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ గోడౌన్‌ను ఉపయోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ను అప్పగించలేదు

లేపాక్షిలోని వ్యవసాయ కార్యాలయం సమీపంలో గత ప్రభుత్వం రూ.40 లక్షలతో గోడౌన్ నిర్మించారు. అయితే ఈ గోడౌన్‌లో చిన్న పనులు చేయాల్సి ఉంది. ఈ గోడౌన్‌లో పూర్తి స్థాయి పనులు చేసి సొసైటీకి అప్పగిస్తే రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది 300 మెట్రిక్ టన్నులు రాగులు కొనుగోలు చేశాం. క్వింటా రాగులు రూ.4,290తో కొనుగోలు చేశాం.

– కృష్ణారెడ్డి, కార్యదర్శి కొండూరు సొసైటీ

ఉపయోగంలోకి తీసుకురావాలి



మండలంలోని వ్యవసాయ రైతులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.లక్షలతో గోడౌన్ నిర్మిస్తే అది ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. దీన్ని ఉపయోగంలో తీసుకువస్తే రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ గోడౌన్‌లో చిన్న మరమ్మతులు చేయించి రైతులకు ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వేణుగోపాల్‌రెడ్డి, రైతు, బింగిపల్లి

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



మడకశిరలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం: మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం కృషి చేయాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. గురువారంఅంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ అనురాధ అధ్యక్షతన జరిగిన సదస్సులో అదనపు జిల్లా జడ్జి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసలు కావడం వల్ల ఓ వైపు శారీరక ఇబ్బందులతో పాటు మరోవైపు మానసికంగా కుంగిపోతారన్నారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రి, డ్రగ్స్ డి అడిషన్ సెంటర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సుదర్శన్, కళావతి, రవిచంద్ర, సంతోషి కుమారి, గురునాథ్, లోక్ అదాలత్ హేమావతి, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

హిందూపురం:మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నిషా ముక్తి భారత్ అభియాన్, అంతర్జాతీయ మత్తు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులతో స్వేర్ సొసైటీ డిస్టిక్ డి అడిషన్ సెంటర్ హిందూపురం కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు ప్ల కార్డులు పట్టుకుని విద్యార్థులు మత్తు పదార్థల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తీవ్రంగా కలవరపెడుతున్న మత్తు మాదకద్రవ్యల తయారీ, వినియోగం పూర్తిగా నిషేధించాలన్నారు. మత్తుకు దూరంగా ఉండి పరిపూర్ణ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు త్రినాథ్ రెడ్డి, నారాయణరెడ్డి, మంజునాథ్, ఏవో గంగిరెడ్డి, ఎస్ఎస్ఎస్ పార్థసారథి , కేశవరెడ్డి రామకష్ణ ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సురేశ్

మడకశిర: పట్టణంలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులు పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడే మానవహారాన్ని నిర్మించి డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, సీఐలు నగేష్, రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పావగడ: మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) వాడకంతో యువత తమ నిండు నూరేళ్ల జీవితాలను అర్థాంతరంగా నాశనం చేసుకుంటున్నారని పట్టణ సీఐ సురేశ్ ఆందోళన చెందారు. తుమకూరు జిల్లా పోలీసు, పావగడ తాలూకా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక జాతాలో ఆయన మాట్లాడారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యం కోల్పోయి బికారులు అవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు అక్రమంగా సరఫరా చేసినా, అమ్మినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణం లోని ప్రధాన రహదారుల్లో విద్యార్థులు జాతా నిర్వహించారు. క్రైం ఎస్ఐ విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూటమి' ఆరాచకాలను ప్రజల్లోకి తీసుకెళదాం



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నర్సేగౌడు

రొళ్ల: కూటమి నాయకుల అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తన స్వగృహంలో ఆయన రాష్ట్ర కుంచిటి వక్కలిగ అనుబంధ సంఘం కమిటీ సభ్యుడు రంగేగౌడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్‌తో కలిసి రొళ్ల, అగళి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అండ్‌కో బ్యాచ్ ఎన్నికల్లో లెక్కలేనన్ని హామీలను ఇచ్చి గెలిచిన తర్వాత వాటి అమలును విస్మరించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజా వ్యతిరేక ఆరాచక పాలను ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ ఓటమి చవి చూసిన కూడా ప్రజల్లో మాత్రం ఎనలేని ప్రజాదరణ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తోందని గుర్తు చేశారు. పార్టీ శ్రేణులు అధైర్య పడకుండా ఉండాలని, వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, అనుబంధ విభాగాల జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార పితామహుడు సాహూ మహరాజ్



సాహు మహరాజ్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం: సాహూ మహరాజ్ బహుజన రాజ్యాధికార పితామహుడు అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు అన్నారు. గురువారం స్థానిక బీఎస్పీ కార్యాలయం వద్ద పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నజీంబాషా అధ్యక్షతన సాహూ మహరాజ్ 151వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పెన్నయ్య, ప్రసాద్, నరసింహులు, హుసేన్ సాహెబ్, రామాంజనప్ప, బాష, అల్లా బకాష్, రామాంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయండి



ఈరలక్కప్పన సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిబండ: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని సమన్వయకర్త ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఫళారం గ్రామంలో సమన్వయకర్త ఈరలక్కప్ప స్వగృహంలో మడకశిర టౌన్ కన్వీనర్‌గా నియమితులైన సతీష్‌కుమార్, వైస్ కన్వీనర్ గోపి, కార్యదర్శులు అంజలి, చంద్రశేఖర్, జబీవుల్లా తదితరులు ఈరలక్కప్పను కలిసి శాలువ కప్పి, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను విస్మరించిదన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడాలన్నారు. ఎంపీపీ కవిత, మడకశిర మండలం రూరల్ కన్వీనర్ రామిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శేషాద్రి, కో ఆప్షన్ సభ్యుడు పకృద్దీన్, నాయకులు చిరంజీవి, వసీన్‌బేగ్, విజయకుమార్, జయరాం శ్రీనివాస్, నరసింహప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన చైతన్య వేదిక కమిటీల ఎన్నిక

అమరాపురం: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ స్మృతి వనంలో గురువారం బహుజన చైతన్య వేదిక నూతన నియోజకవర్గ, అమరాపురం మండల కమిటీలను వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్వొకేట్ శివరామకృష్ణ, రీజనల్ ప్రధాన కార్యదర్శి ఏ.నారాయణ, గౌరవ అధ్యక్షుడు బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉదుగూరు ఆటో తిప్పయ్య, ఉపాధ్యక్షులుగా టి.శంకర్, మధూడి బీమరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్లోటి హనుమంతు, కార్యదర్శిగా రొళ్ల తిప్పేహనుమంతు, సహాయ కార్యదర్శిగా గుడిబండ రవి, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులుగా జి.ప్రసాద్, కెంచప్ప, జేకే. నరసింహమూర్తి, ఎల్‌కె. నరసింహప్పను ఎన్నుకున్నట్లు శివరామకృష్ణ తెలిపారు. అలాగే మండలాధ్యక్షుడిగా వీరాపురం సురేష్, ఉపాధ్యక్షులుగా కరియన్న, భూతరాజు, రాజేష్, ప్రధాన కార్యదర్శిగా నిద్రగట్ట మంజునాథ, కార్యదర్శిగా సిద్దేశ్వర, కుమార్, రాజప్ప, సమన్వయకర్తగా రామచంద్రప్ప, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా మల్లేశ్ వర్మ, మీడియా మండల ఇన్‌చార్జ్ కెంకెర సిద్దేశ్వర, శివాచారి, మైనారిటీ మండలాధ్యక్షుడిగా ఇదాయత్, ఉపాధ్యక్షుడిగా దాదాపీర్‌ను ఎన్నుకున్నామన్నారు.

బదిలీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వండి

హిందూపురం: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో దివ్యాంగ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్ధ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ బదిలీ ప్రక్రియలో రాజకీయ ప్రమేయం, సిఫార్సు లేఖలకు ప్రాధాన్యత లేకుండా పారదర్శకత పాటించాలన్నారు. దివ్యాంగుల చట్టం 2016 అనుసరించి బదిలీలలో దివ్యాంగులకు మినహాయింపు ఇస్తూ వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేయాలని కోరుతున్నామన్నారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలి

హిందూపురం: మతం మారిన దళితులందరినీ సమానంగా చూడాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదానే కొనసాగించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఅండ్ఐజీ కాంపౌడ్ చర్చిలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మతం మారిన దళితులందరినీ సమానంగా చూడాలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలన్నారు. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు నాయకత్వంలో సింగిల్ ఎజెండాతో 29 ఏళ్లుగా ఫెడరేషన్ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. అనంతరం పాస్టర్లు, క్రైస్తవ నాయకులు ప్రపంచ, దేశ, రాష్ట్ర శ్రేయస్సు శాంతి కొరకు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ క్రిస్టియన్ లీడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ సూర్యప్రకాష్, సంఘ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పి.స్టీఫెన్ రాజ్, ట్రెజరర్ సాల్మన్‌రాజ్, బోర్డు సభ్యులు అరుణ్ కుమార్, దేవరాజ్, ఆంజనేయులు, రూబేన్, డేవిడ్, డ్యానియెల్, శ్యామ్ బాబు, యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములు వెనక్కి ఇవ్వండి



ర్యాలీలో మాట్లాడుతున్న పూజారప్ప

పావగడ: చేతివృత్తుల పరిశ్రమకు రైతుల నుంచి సేకరించిన 1780 ఎకరాల భూమిని తిరిగి రైతులకే వెనక్కి ఇవ్వాలని స్థానిక కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో గురువారం చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూముల్ని పారిశ్రామికవేత్తలకు అంట గట్టి రైతులను బికారులు చేస్తోందని దుయ్యబట్టారు. వెంటనే సీఎం సిద్ధ రామయ్య, డీసీఎం డీకే శివకుమార్ జోక్యం చేసుకుని రైతుల భూముల్ని వెనక్కి ఇప్పించడంతో పాటు దేవనహళ్ళి ఉద్యమంలో అరెస్ట్ అయిన రైతులను వెంటనే విడిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి రైతుల సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తాలూకా కార్యాయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. దళిత నాయకుడు కృష్ణమూర్తి, బ్యాడనూరు శివ, రామాంజి, దుర్గప్ప సదాశివ తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వేసిన మెట్లు తొలగింపు

హిందూపురం టౌన్: పట్టణ ప్రైవేట్ బస్టాండ్ సమీపంలో విఠల్ బిల్డింగ్ వద్ద రహదారిపై రోడ్డుకు అడ్డంగా వేసిన మెట్లు తొలగించారు. మూడు రోజుల క్రితం నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఇనుప మెట్లు ఏర్పాటు చేసి, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని ప్రజలు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రహదారిపై ఏర్పాటు చేసిన ఇనుపమెట్ల తొలగింపజేసి రాకపోకలకు సౌకర్యం కల్పించారు.

13న ఎస్ఎస్‌కే సంఘం ఎన్నికలు

పావగడ: స్థానిక ప్రతిష్టాత్మక ఎస్ఎస్‌కే(శనీశ్వరస్వామి కార్యనిర్వాహక సంఘం) ఎన్నికలు వచ్చే నెల 13న జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27 శుక్రవారం నుంచి వచ్చే నెల 2 వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ, 3న నామినేషన్ల పరిశీలన, 6న నామినేషన్ల ఉపసంహారణ, 7న అభ్యర్థుల జాబితా ప్రకటన, 13న ఆదివారం ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారి పీఎస్ సోమసుందర్ గురువారం తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్ఎస్‌కే సంఘంలో మొత్తం 142 మంది జీవితకాల సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. 15 డైరెక్టర్ల స్థానాలకు జరిగే ఎన్నికల్లో వారు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వచ్చే జూలై నెల 13న మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎస్ఎస్‌కే సంఘం డైనింగ్ హాల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. అదేరోజు సాయంత్రం 7 గంటల నుంచి ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



గోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయతీలోని వీవర్స్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇల్లూరి గోపాల్ అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ నియోజక వర్గ నేత వేణురెడ్డి వీవర్స్ కాలనీకి చేరుకొని గోపాల్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేశారు. స్థానిక సర్పంచ్ మూర్తి, వైస్ సర్పంచ్ నరేంద్ర, ఎంపీటీసీ మంజు, హేమంత్ రెడ్డి, రంగయ్య, ప్రభాకర్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా

మడకశిర: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో గురువారం మెగా జాబ్‌మేళా జరిగింది. జాబ్ మేళాను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. టెన్త్,ఇంటర్, డిప్లొమా,డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు హాజరయ్యారు. మొత్తం 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంపికై న అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి ఎంపిక



ఉష శ్రీ

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉష శ్రీ అనే విద్యార్థిని త్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు నాగార్జున గురువారం తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని 577 మార్కులు సాధించిందన్నారు.

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఐఐఐటీలో సత్తాచాటారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించి, ఐఐఐటీలో సీట్లు సాధించారన్నారు. ఆర్.స్పందన, జి.హేమాబాయి నూజివీడు త్రిపుల్ ఐటీలో, భానుశ్రీ, కీర్తన ఒంగోలులోని ఆర్కే వ్యాలీలో సీట్లు సాధించారన్నారు. అదేవిధంగా ఎస్ఎస్‌వైపీఎస్ పాఠశాల విద్యార్థిని ప్రీతిబాయి శ్రీకాకుళంలోని త్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

'కురుబల అభ్యున్నతికి పాటుపడుతా'

పెనుకొండ: రాజకీయాలకు అతీతంగా కురుబల అభ్యున్నతికి పాటుపడుతానని ఆ సంఘం నాయకుడు ఈశ్వర్ ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలో పలువురు కురుబ సంఘం నాయకులు ఈశ్వర్ ప్రసాద్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కురుబ కులస్థుల అభ్యున్నతికి పాటుపడుతానని, ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

కుంచిటి వక్కలిగ సముదాయ భవన నిర్మాణానికి విరాళం



అనంతరాజుకు రూ.లక్ష నగదు అందిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో నిర్మిస్తున్న కుంచిటి వక్కలిగ సముదాయ భవనానికి గుడిబండ మండలం కేఎన్ పల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు సురేష్ రూ.లక్ష విరాళాన్ని అందించారు. గురువారం మడకశిరలో కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు అనంతరాజుకు నగదు అందజేశారు. ఈసందర్భంగా సురేష్‌ను సంఘం నాయకులు అభినందించారు. సముదాయ భవన నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న అందరికీ అనంతరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కౌంటర్ ప్రారంభం

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌ను రైల్వే శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. బెంగళూరు, అనంతపురం వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లకు టికెట్లు ప్రయాణికులకు ఇస్తామని కౌంటర్ నిర్వాహకుడు మంజు తెలిపారు. రైలు వచ్చే అరగంట ముందు ప్రయాణికులు స్టేషన్‌లో టికెట్లు తీసుకోవచ్చన్నారు.